23.94 కోట్ల క్రిప్టో కరెన్సీ స్వాధీనం

న్యూఢిల్లీ: గెయిన్‌బిట్‌కాయిన్ కుంభకోణం కేసులో సీబీఐ సోదాలు ముగిశాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఢిల్లీ, పుణే, నాందేడ్, కొల్హాపూర్, ముంబై, బెంగళూరు, చండీగఢ్, మొహాలి, ఝాన్సీ, హుబ్లిలలో దాదాపు 60 చోట్ల మంగళ, బుధ వారాల్లో ఈ సోదాలు జరిగాయి. ఈ కేసులో రూ.23.94 కోట్ల విలువైన క్రిప్టో కరెన్సీలను సీబీఐ స్వాధీనం చేసుకుంది. కొన్ని హార్డ్ వేర్ క్రిప్టో వ్యాలెట్లు, 121 పత్రాలు, 34 ల్యాప్‌టాప్‌లు, హార్డ్ డిస్కులు; 12 మొబైల్ ఫోన్లు, ఈ-మెయిల్, ఇన్‌స్టంట్ మెసేజింగ్ అప్లికేషన్ డంప్స్‌ను స్వాధీనం చేసుకుంది. అంతర్జాతీయ లావాదేవీలు, నిధుల దుర్వినియోగం గురించి మరిన్ని వివరాలను తెలుసుకునేందుకు ఎలక్ట్రానిక్ డివైస్‌లను ఫోరెన్సిక్ అనాలసిస్‌కు పంపించింది. ఈ కుంభకోణం అత్యంత సంక్లిష్టంగా ఉండటంతో సుప్రీంకోర్టు దీనిపై దర్యాప్తు బాధ్యతను సీబీఐ (కేంద్ర దర్యాప్తు సంస్థ)కు అప్పగించింది.

'తమిళం మాట్లాడ లేకున్నా క్షమించండి'

కోయంబత్తూరు: ప్రపంచంలోనే అతి ప్రాచీన భాష తమిళం అని కేంద్ర మంత్రి అమిత్ షా అన్నారు.అటువంటి గొప్ప భాష మాట్లాడలేకపోతున్నందుకు తనను క్షమించాలని ఆయన ప్రజలను కోరారు. కోయంబత్తూరులో బుధవారం జరిగిన ఒక బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దేశ వ్యతిరేక పార్టీ అయిన డీఎంకే 2026 ఎన్నికల్లో ఓటమి పాలవుతుందని, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

చిన్నపిల్లల తగాదాలా ఉంది

హిందీని బలవంతంగా రుద్దుతున్నారని తమిళనాడులో అధికార డీఎంకే ఆరోపించడం, దానికి కేంద్రం బెదిరింపు సమాధానం చూస్తుంటే ఇదంతా చిన్నపిల్లల తగాదాలా ఉందని నటుడు, తమిళగ వెట్రీ కజగం పార్టీ అధ్యక్షుడు విజయ్ విమర్శించారు.

వైభవంగా ముగిసిన కుంభమేళా

66 కోట్ల మందికి పైగా పుణ్య స్నానాలు.. చివరి రోజూ ప్రయాగ్‌రాజ్‌కు భక్తుల వరద

ప్రయాగ్‌రాజ్, కోల్‌కతా, ఫిబ్రవరి 26: కోట్లాది మంది భక్తుల విశ్వాసం, అఖాడాల ఆశీర్వాదాలతో హిందువులు పవిత్రంగా భావించే ప్రయాగ్‌రాజ్ మహా కుంభ మేళా శివరాత్రి పర్వదినమైన బుధవారం వైభవంగా ముగిసింది. ప్రజల భక్తి, ఐక్యత, సామరస్యాల సంగమంగా నిలిచిన ఈ వేడుకకు త్రివేణి సంగమం సాక్షిగా నిలిచింది. జనవరి 13న ప్రారంభమై 45 రోజుల పాటు జరిగిన ఈ మేళాలో 66.21 కోట్ల మందికి పైగా పాల్గొని పుణ్య స్నానాలు చేయగా, ఆఖరి రోజు1.44 కోట్ల మందికి పైగా భక్తులు హాజరైనట్టు అంచనా. ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక ఉత్సవంగా ఇది రికార్డులకెక్కింది. దేశ, విదేశీ ప్రముఖులు ఈ కుంభమేళాలో పవిత్ర స్నానాలు చేశారు. ఈ కుంభమేళాకు ప్రత్యక్షంగా హాజరు కాని భక్తులకు డిజిటల్ ఫొటో స్నానం చేయించడం విశేషం.

తప్పని విషాద ఘటనలు

ఈ మహా ఉత్సవంలో కొన్ని విషాద ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. జనవరి 29న మౌని అమావాస్య నాడు జరిగిన తొక్కిసలాటలో 30 మంది మరణించగా, 60 మంది గాయపడ్డారు. వివిధ ప్రదేశాలలో కుంభమేళాకు వస్తున్న, వెళ్తున్న భక్తులు రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. కుంభమేళా జరుగుతున్న ప్రదేశంలో మూడు నాలుగుసార్లు అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కుంభమేళాకు వచ్చే దారులన్నీ కిలో మీటర్ల మేర తరచూ ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయాయి. ఐఐటీ బాబా, కబూతర్ వాలా బాబా, పూసలమ్ముకునే మోనాలిసా లాంటి వారు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం పొందారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీకి గాయాలు

కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తున్న జార్ఖండ్‌కు చెందిన రాజ్యసభ ఎంపీ మహువా మాజీ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం తెల్లవారుజామున 2.30 గంటకు వారి కారు జార్ఖండ్‌లోని హాట్‌వగ్ గ్రామం వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రక్కును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎంపీతో పాటు ఆమె కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి.

144 ఏండ్లకు కుంభమేళానా.. వాస్తవమెంత?

మహా కుంభమేళా 144 ఏండ్లకు ఒకసారి వస్తుందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవమెంత ఉందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రశ్నించారు. ఇటీవల కుంభమేళాలో జరుగుతున్న ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేసిన ఆమె 144 ఏండ్లకు ఒకసారి మహా కుంభమేళా జరుగుతుందని వేసిన అంచనాను ప్రశ్నించారు. మతా బెనర్జీ వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని బీజేపీ విమర్శించింది.

హిందూ ఓటర్లూ.. రాహుల్‌ను బహిష్కరించండి

ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు విచ్చేసిన హిందూ మహా ఉత్సవం మహా కుంభ మేళాను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, శివ సేన (యూబీటీ) నేత ఉద్ధవ్ ఠాక్రే సందర్శించకుండా హిందువులను అవమానించారని కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే విమర్శించారు. వీరిని హిందూ ఓటర్లు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. కోట్లాది హిందువుల మనోభావాలను గౌరవించి రాహుల్, ఠాక్రే కుటుంబాలు ఇందులో పాల్గొనాలని, కాని వారు దానికి గైర్హాజరై హిందువులను అవమానపరిచారని విమర్శించారు.

అమెరికా డీల్‌కు ఉక్రెయిన్ గ్రీన్ సిగ్నల్

ఖనిజాల తవ్వకంపై 500 బిలియన్ డాలర్లకు ఓకే!

అమెరికా, ఫిబ్రవరి 26: అమెరికా, ఉక్రెయిన్ మధ్య ఖనిజాల ఒప్పందానికి రంగం సిద్ధమైంది. ఉక్రెయిన్‌లో ఖనిజాల తవ్వకం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అంగీకరించారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ముగిస్తామన్న ట్రంప్.. ఖనిజాల తవ్వకానికి సంబంధించిన ప్రతిపాదన చేశారు. మొదట్లో ట్రంప్ డీల్‌కు అంగీకరించని జెలెన్‌స్కీ.. కొన్ని మార్పులతో పచ్చజెండా ఊపినట్టు ఒక అధికారి చెప్పారు. శుక్రవారం ఇరుదేశాల ప్రతినిధులు సంతకాలు చేసే అవకాశ ఉందని అంతర్జాతీయ మీడియాలు కథనాలు వస్తున్నాయి. వాషింగ్టన్‌లో జరిగే ఎంవోయూ కార్యక్రమంలో జెలెన్‌స్కీ కూడా పాల్గొంటారని తెలుస్తున్నది. ఈ ఒప్పందం 500 బిలియన్ డాలర్ల డీల్ అని ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లో శాంతిని నెలకొల్పేలా అమెరికా పెట్టుబడులు పెట్టడం, ఆర్థిక సాయం సహా వివిధ అంశాలు ఒప్పందంలో ఉన్నాయని తెలుస్తున్నది. ఈ ఒప్పందం కుదిరితే ఉక్రెయిన్‌లో సగం సహజ వనరులపై అమెరికా అధిపత్యం లభించే అవకాశాలు ఉన్నాయి.

డెమొక్రాట్లు నన్ను చంపాలనుకుంటున్నారు

ఎలాన్ మస్క్ తీవ్ర ఆరోపణ

వాషింగ్టన్, ఫిబ్రవరి 26: ప్రపంచ బిలియనీర్, టెస్లా అధిపతి ఎలాన్ మస్క్ అమెరికాలోని విపక్ష పార్టీపై తీవ్ర ఆరోపణలు చేశారు. డెమొక్రాట్లు తనను చంపాలని అనుకుంటున్నారని ఆయన తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ (డోజ్)లో తాను చేస్తున్న విప్లవాత్మక సంస్కరణలు వారికి నచ్చడం లేదని, అలా చేసినందుకు వారు నన్ను చంపాలనుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఇటీవల ఖజానాపై ఆర్థిక భారం తగ్గించే నెపంతో ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డోజ్ పలు వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంది. బెదిరిస్తూ ఉద్యోగులకు ఈ-మెయిల్స్ పంపడం వంటి చర్యలను డెమొక్రాట్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ క్రమంలో ఒక యువకుడు డోజ్‌కు సంబంధించి మస్క్‌కు మద్దతిస్తూ ఆయనను ఉద్దేశించి ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టాడు. దీనికి మస్క్ స్పందిస్తూ డెమొక్రాట్లు తనను చంపాలనుకుంటున్నారని ఆరోపణలు చేశారు.

యుద్ధ నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడి చేసే క్షిపణి సామర్థ్య పరీక్షను భారత్ విజయవంతంగా నిర్వహించింది. మొట్టమొదటి ఈ తరహా క్షిపణి పాటవాన్ని ఒడిశాలోని చండీపూర్ తీర సమీపంలో పరీక్షించినట్టు రక్షణ శాఖ తెలిపింది.

కాంగోలో అంతు చిక్కని వ్యాధితో 53 మంది మృతి

కిన్షాస (కాంగో), ఫిబ్రవరి 26: కాంగోలో అంతు చిక్కని వ్యాధి పౌరుల ప్రాణాలను బలి తీసుకుంటున్నది. దేశ వాయువ్య ప్రాంతంలో ఈ వ్యాధి బారిన పడి గత ఐదు వారాల వ్యవధిలో 50 మందికి పైగా మృతి చెందారు. తొలుత గబ్బిలాన్ని తిన్న ముగ్గురు పిల్లలు అస్వస్థతకు గురయ్యారు. అనంతరం ఈ వ్యాధి విస్తరించి పలువురు మరణించారు. మొదట జ్వరం, వాంతులు, అంతర్గత రక్తస్రావం లక్షణాలు కన్పించే ఈ వ్యాధి బారిన పడ్డవారిలో చాలా మంది 48 గంటల్లోనే మృతి చెందుతున్నారు. దేశంలో 419 కేసులు నమోదు కాగా, 53 మంది మరణించారు. తొలత బొలోకో అనే గ్రామంలో జనవరిలో ఈ వ్యాధి బయటపడింది.

ఏ పనికైనా ఏఐ ఏజెంట్ సిద్ధం!

- అయితే మనుషుల పర్యవేక్షణ తప్పనిసరి
- కీలక నిర్ణయాల్లో అప్రమత్తత తప్పదు
- ఏఐ ఏజెంట్ల అభివృద్ధికి కంపెనీల పోటీ

న్యూఢిల్లీ: మానవుడి నిత్య జీవితంలో కృత్రిమ మేధ (ఏఐ) భాగం కాబోతున్నది. తదుపరి తరం ఏఐని అందుబాటులోకి తెచ్చేందుకు టెక్ కంపెనీలు పోటీ పడుతున్నాయి. కొందరు ఇప్పటికే రోజువారీ కార్యకలాపాల నిర్వహణ కోసం ఏఐ హెల్పర్లను అందుబాటులోకి తెస్తున్నారు. చాట్‌జీపీటీని అభివృద్ధి చేసిన ఓపెన్‌ఏఐ కంపెనీ గత నెలలో ఆపరేటర్ అనే ఏఐ ఏజెంట్‌ను పరిచయం చేసింది. ఇది వెబ్‌ను ఉపయోగించుకుని ఫారాలను నింపడం, వంట వండటానికి అవసరమైన సరుకులను ఆర్డర్ ఇవ్వడం వంటి పనులు చేస్తుందని ఆ కంపెనీ తెలిపింది. ఇక ఈ పరుగు పందెంలోకి గూగుల్ కూడా ప్రవేశించింది. ఏఐ కో-సైంటిస్ట్‌ను గూగుల్ బుధవారం ప్రకటించింది. అదే విధంగా సేల్స్ ఫోర్స్ నిరుడు ఏజెంట్‌ఫోర్స్‌ను పరిచయం చేసింది. వెంటనే మైక్రోసాఫ్ట్ స్పందించి, ఏఐ ఏజెంట్ల నిర్మాణం కోసం కోపైలట్ స్టూడియో సిద్ధమవుతున్నదని తెలిపింది. మల్టీమోడల్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్‌ను అభివృద్ధి చేయడానికి ఇటీవలి సంవత్సరాల్లో ఓపెన్ ఏఐతో పాటు గూగుల్, మెటా వంటి టెక్ జెయింట్లు, ఆంత్రోపిక్, స్టెబిలిటీ ఏఐ వంటి లీడింగ్ ఏఐ స్టార్టప్స్ పోటీ పడుతున్నాయి. బొమ్మలు, వీడియోల రూపంలో ఔట్‌పుట్‌ను జనరేట్ చేయడం కోసం కృషి చేస్తున్నాయి. డెవలపర్స్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్‌ను ఏఐ పవర్డ్ టూల్స్‌కు అనుసంధానం చేయడంపై దృష్టి సారించారు.



శివ నామ స్మరణలో...

తమిళనాడులోని కోయంబత్తూరు సమీపంలో గల ఇషా ఫౌండేషన్‌లో బుధవారం రాత్రి మహా శివరాత్రి ఉత్సవాలు, ప్రార్థనలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఇషా ఫౌండేషన్ వ్యవస్థాపకులు జగ్గీ వాసుదేవ్, కేంద్ర మంత్రి అమిత్ షాతో పాటు దేశం నలు మూలల నుంచి వచ్చిన వందలాది భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

హీరో, విలన్ ఆయనే!

రణబీర్‌కపూర్ హీరోగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందిన 'యానిమల్' సినిమా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఫాదర్ సెంటిమెంట్ నేపథ్యంలో హైఇంటెన్సిటీ యాక్షన్ డ్రామాగా ప్రేక్షకుల్ని మెప్పించింది. అయితే ఈ సినిమాలో హింస శృతిమించిందని, మహిళా పాత్రల్ని తక్కువ చేసి చూపించారనే విమర్శలు కూడా వచ్చాయి. తాజాగా వీటిపై ఓ ఇంటర్వ్యూలో స్పందించారు దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా. అదే సమయంలో సినిమా సీక్వెల్ గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ''యానిమల్' సినిమాలో హీరో రణబీర్ పర్‌ఫార్మెన్స్‌ను ప్రశంసిస్తూ, నాపై విమర్శలు చేశారు. నేను బాలీవుడ్‌కు కొత్త కాబట్టి ఎలాంటి విమర్శలు చేసినా ఏం కాదనే ధోరణి వారిది. కానీ రణబీర్‌కపూర్‌తో సినిమాలు చేయాల్సిన అవసరం ఉంటుంది కాబట్టి ఆయన్ని ఏమీ అనలేకపోయారు' అని సందీప్‌రెడ్డి వంగా తెలిపారు. 'యానిమల్' సినిమాను స్క్రిప్ట్‌దశలోనే మూడు భాగాలుగా తీయాలనుకున్నానని, రెండో భాగం 'యానిమల్ పార్క్'లో రణబీర్‌కపూర్ ద్విపాత్రాభినయంలో కనిపిస్తారని, హీరో..విలన్ పాత్రల్ని ఆయనే పోషిస్తారని సందీప్‌రెడ్డి వంగా పేర్కొన్నారు.

తెలుగు వెర్షన్‌లో 'ఛావా'

ఛత్రపతి శివాజీ తనయుడు శంభాజీ వీరోచిత గాథతో రూపొందించిన 'ఛావా' చిత్రానికి దేశవ్యాప్తంగా ఆదరణ లభిస్తున్నది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద 400కోట్లకుపైగా వసూళ్లతో దూసుకుపోతున్నది. శంభాజీ మహారాజ్‌గా విక్కీ కౌశల్ నటనకు సర్వత్రా ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలుగు డబ్బింగ్ వెర్షన్ గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ద్వారా మార్చి 7న విడుదలకానుంది. ఓ పోరాటయోధుడి కథ తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యేలా ఈ సినిమాను డబ్బింగ్ చేసి విడుదల చేస్తున్నామని, భారీ స్థాయిలో రిలీజ్ ఉంటుందని గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ తెలిపింది. విక్కీ కౌశల్, రష్మిక మందన్న, అక్షయ్ ఖన్నా, డయానా పెంటీ, అశుతోష్ రాణా తదితరులు ముఖ్యపాత్రల్ని పోషించారు. లక్ష్మణ్ ఊటేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని దినేష్ విజన్ నిర్మించారు.

చిత్రం

జాతకం మారిపోవాల్సిందే!

గత కొంతకాలంగా తెలుగు ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్నది మంగళూరు సోయగం పూజాహెగ్డే. బాలీవుడ్‌లో వరుస పరాజయాలు పలకరించడంతో ప్రస్తుతం ఈ భామ తమిళ సినిమాపై దృష్టిపెడుతున్నది. అక్కడ సూర్య 'రెట్రో', దళపతి విజయ్ 'జన నాయగన్' సినిమాలతో పాటు రాఘవ లారెన్స్ హారర్ చిత్రం 'కాంచన-4'లో పూజాహెగ్డే కథానాయికగా నటిస్తున్నది. ఈ మూడు సినిమాలతో తిరిగి దక్షిణాదిన పూర్వవైభవం సాధిస్తాననే విశ్వాసంతో ఉంది. ఈ నేపథ్యంలో 'కాంచన-4'లో పూజాహెగ్డే పాత్రకు సంబంధించిన ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నది. కెరీర్‌లోనే ఆమె కిది సవాలుతో కూడుకున్న పాత్ర అని చెబుతున్నారు. ఇందులో పూజాహెగ్డే మూగ మరియు చెవిటి అమ్మాయి పాత్రలో కనిపిస్తుందని సమాచారం. ఇప్పటివరకు కెరీర్‌లో ఎక్కువగా గ్లామర్ నాయికగానే పేరు తెచ్చుకున్న పూజాహెగ్డే ఈ సినిమాలోని పాత్ర ద్వారా సరికొత్త ఇమేజ్‌ను సంపాదించుకుంటుందని చిత్ర వర్గాలు అంటున్నాయి. నటిగా తన జాతకాన్ని మార్చే చిత్రమిదని పూజా హెగ్డే సైతం తన సన్నిహితుల దగ్గర చెబుతున్నదట. రాఘవ లారెన్స్ దర్శకత్వం వహిస్తున్న 'కాంచన-4' ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకురానుంది.

మరోసారి విలన్ పాత్రలో?



బాలీవుడ్ అగ్ర నటుడు సంజయ్‌దత్ తెలుగులో వరుసగా సినిమాలు చేస్తున్నారు. 'డబుల్ ఇస్మార్ట్'లో ప్రతినాయకుడిగా నటించిన ఆయన ప్రస్తుతం ప్రభాస్ 'రాజాసాబ్'లో కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. 'అఖండ-2' చిత్రంలో కూడా సంజయ్‌దత్ విలన్‌గా నటించే అవకాశముందని ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తున్నది. ఇదిలావుండగా ఆయన మరో తెలుగు చిత్రానికి ఓకే చెప్పారని, అందులో కూడా ప్రతినాయకుడిగానే కనిపించనున్నారని సమాచారం. వివరాల్లోకి వెళితే.. సాయిధరమ్‌తేజ్ కథానాయకుడిగా 'సంబరాల ఏటిగట్టు' అనే చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. కేపీ రోహిత్ దర్శకుడు. దాదాపు వందకోట్ల భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారని తెలిసింది. ఈ సినిమాలో ప్రతినాయకుడిగా సంజయ్‌దత్ నటించనున్నారని వార్త లొస్తున్నాయి. ఇటీవలే దర్శకుడు ఆయన్ని కలిసి కథ చెప్పారని, తన పాత్రలోని కొత్తదనం నచ్చడంతో సంజయ్‌దత్ ఈ ప్రాజెక్ట్‌కు అంగీకరించారని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతున్నది.

అదృశ్యశక్తులు ఉంటాయేమో అనుకున్నా!

కెరీర్ ఆరంభం నుంచి వినూత్న కథలతో ప్రయాణం సాగిస్తున్నారు ఆది పినిశెట్టి. ఆయన నటించిన హారర్ చిత్రం 'శబ్దం'. అరివళగన్ దర్శకుడు. పారానార్మల్ యాక్టివిటీ నేపథ్యంలో తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకురానుంది. నైజాంలో ఈ చిత్రాన్ని మైత్రీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా ఆది పినిశెట్టి పంచుకున్న సినిమా విశేషాలు..

- 'శబ్దం' భావోద్వేగాలు కలబోసిన హారర్ చిత్రం. రెగ్యులర్ హారర్ చిత్రాలకు చాలా భిన్నంగా ఉంటుంది. ఆత్మలను సైంటిఫిక్ పంథాలో అన్వేషించే పాయింట్ కొత్తగా అనిపిస్తుంది. ఇలాంటి హారర్ వరల్డ్‌ను ప్రేక్షకులు ఇప్పటివరకు చూసి ఉండరు. సాంకేతికంగా అన్ని అంశాల్లో ఉన్నతంగా కనిపిస్తుంది.
- ఈ సినిమాలో నేను పారానార్మల్ యాక్టివిటీస్‌ను పరిశోధించే ఇన్వెస్టిగేటర్ పాత్రలో కనిపిస్తా. ఆత్మలను శబ్దం ద్వారా కనిపెట్టి వాటి చర్యలను తెలుసుకుంటాను. టైటిల్ తగినట్లుగానే ప్రతి సన్నివేశంలో సౌండ్ ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్‌గా ఉంటుంది. స్వతహాగా నాకు ఆత్మలు, అతీత శక్తులపై నమ్మకం లేదు. కానీ ఈ సినిమా కోసం సేకరించిన పుస్తకాలను చదివినప్పుడు నిజంగా అదృశ్య శక్తులు ఉంటాయేమో అనిపించింది.
- ఈ కథలో శబ్దం ఎలిమెంట్ కీలక భూమిక పోషిస్తుంది కాబట్టి థియేటర్‌లో చూస్తేనే నిజమైన అనుభూతిని పొందగలం.
- తమన్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్రధానాకర్షణ. ఆయన పెద్ద సినిమాలు చేస్తూ కూడా ఈ సినిమాకు మ్యూజిక్ అందించాడు. సౌండ్ డిజైనింగ్ కూడా అద్భుతంగా కుదిరింది.
- నాకు డ్రీమ్‌రోల్స్ అంటూ ఏమీ లేవు. ఏ పాత్ర చేసినా గుర్తుండిపోవాలన్నదే నా అభిమతం. ప్రస్తుతం 'అఖండ-2' సినిమాలో ఓ ముఖ్య పాత్రను పోషిస్తున్నా. దేవాకట్టా డైరెక్షన్‌లో ఓ సినిమా చేస్తున్నా. 'డ్రైవ్' 'మరకత మణి-2' షూటింగ్స్ జరుగుతున్నాయి.

నేటి సమాజానికి దర్పణం

నూతన నటీనటులు, సీనియర్ యాక్టర్స్‌తో కలిసి దర్శకుడు గుణశేఖర్ రూపొందిస్తున్న చిత్రం 'యుఫోరియా'. భూమిక, సారా అర్జున్, నాసర్, రోహిత్ తదితరులు ముఖ్యపాత్రలను పోషిస్తున్నారు. షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. శివరాత్రి సందర్భంగా బుధవారం స్పెషల్ మేకింగ్ వీడియోను విడుదల చేశారు. 'సమకాలీన అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. నేటి సమాజంలో జరుగుతున్న సంఘటనలకు దర్పణంలా ఉంటుంది. భూమిక పాత్ర భావోద్వేగాలతో సాగుతుంది. త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, నిర్మాత: నీలిమా గుణ, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: గుణశేఖర్.

విగ్గు విజ్ఞాన్‌కుమార్



విక్రాంత్, చాందిని చౌదరి జంటగా నటిస్తున్న చిత్రం 'సంతానప్రాప్తిరస్తు'. సంజీవ్ రెడ్డి దర్శకుడు. మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మాతలు. ఓ సమకాలీన అంశాన్ని చర్చిస్తూ వినోదాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో ఇంగ్లీష్ రాని ప్రాజెక్ట్ మేనేజర్ విజ్ఞాన్‌కుమార్‌గా నటుడు జీవన్ కుమార్ కనిపించనున్నారు. విగ్గు పెట్టుకొని ఆయన పండించే హాస్యం కడుపుబ్బా నవ్విస్తుందని, త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తామని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్‌కశ్యప్, దర్శకత్వం: సంజీవ్ రెడ్డి.

వరంగల్ నేపథ్యంలో వినోదం

తెలంగాణ నేపథ్యంలో రూపొందిస్తున్న వినోదాత్మక చిత్రం 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే'. రాజా దుస్సా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గాలి కృష్ణ నిర్మిస్తున్నారు. '1980లో వరంగల్‌లో జరిగిన ఓ యథార్థ సంఘటన ఆధారంగా ఈ కథను తయారు చేశాం. ఆద్యంతం చక్కటి హాస్యంతో అలరిస్తుంది. తెలంగాణ నేటివిటీతో అందరిని ఆకట్టుకుంటుంది. ఈ సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడిస్తాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాణ సంస్థ: శ్రీరామకృష్ణ సినిమా, రచన-దర్శకత్వం: రాజా దుస్సా.

'చంద్రేశ్వర' శివగీతం

సురేష్ రవి, ఆశా వెంకటేష్ జంటగా నటిస్తున్న చిత్రం 'చంద్రేశ్వర'. జీవీ పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వంలో రవీంద్రచారి నిర్మిస్తున్నారు. త్వరలో విడుదల కానుంది. మహాశివరాత్రి సందర్భంగా ఈ సినిమాలోని శివుడి గీతాన్ని విడుదల చేశారు. ఆర్కియాలజీ కాన్సెప్ట్‌తో సాగే సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిదని, పురాతన ఆలయాల నేపథ్యంలో కథ నడుస్తుందని నిర్మాత తెలిపారు. శివుడి మీద రూపొందించిన ఈ గీతం సినిమాకు ప్రధానాకర్షణగా నిలుస్తుందని మేకర్స్ చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: జెరాడ్ ఫిలిక్స్, దర్శకత్వం: జీవీ పెరుమాళ్ వర్ధన్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.